## క్లుప్తంగా

### అమ్మవారిని దర్శించుకున్న రాజ్‌కుమార్


రాజ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఈఓ

గూడూరు రూరల్: మండల పరిధిలోని కె.నాగలాపురం సుంకులాపరమేశ్వరీదేవిని ఆలయ నిర్మాణ దాత రాజ్‌కుమార్ సేతుపతి మంగళవారం దర్శించుకున్నారు. రాజ్‌కుమార్‌ను ఆలయ ఈఓ రాధాకృష్ణ, గ్రామ పెద్దలు పూల మాల వేసి, శాలువాతో సత్కరించారు. అమ్మవారి తీర్థ, ప్రసాదాలు అందించారు. అనంతరం ఆయన బూడిదపాడులో నిర్మితమవుతున్న శివాలయాన్ని సందర్శించారు. ఆలయ నిర్మాణానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు.

### డెంగీపై అప్రమత్తంగా ఉండండి


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గడివేముల: వర్షాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో డెంగీ వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ తేజస్విని సూచించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి పాత బస్టాండ్ వరకు ప్రజలకు అవగాహన కలిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తేజశ్రీని మాట్లాడుతూ డెంగీ నివారణ మాసోత్సవాలను ఈ నెలాఖరు వరకు నిర్వహించనున్నామన్నారు. లార్వా, ఫీవర్ సర్వేలను క్రమం తప్పకుండా సిబ్బంది చేపట్టాలన్నారు.

### అవకతవకలకు పాల్పడితే చర్యలు

గడివేముల: గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏపీడీ బాలాజీ నాయక్ హెచ్చరించారు. మండల పరిధిలోని గని, మంచాలకట్ట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఏపీడీ మాట్లాడుతూ ఉద్యానవన పంటలకు ప్రభుత్వ అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాబార్డు కింద నిధులు పుష్కలంగా ఉన్నాయని, రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ వెంకటరమణ, టెక్నికల్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

### కర్నూలు వెళ్లి పింఛన్ పంపిణీ


అన్నమ్మకు పింఛన్ సొమ్ము అందిస్తున్న వలంటీర్ మల్లేశ్వరి

గడివేముల: అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న అన్నమ్మకు మంగళవారం కరిమద్దెల గ్రామ వలంటీర్ మల్లేశ్వరి అందజేశారు. అన్నమ్మ కొంత కాలంగా ఆరోగ్య సమస్యలతో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. పింఛన్ సొమ్ము తీసుకునేందుకు రాలేని పరిస్థితిలో ఉన్న ఆమెకు వలంటీర్ మల్లేశ్వరి అక్కడికి వెళ్లి పింఛన్ నగదు అందజేసింది.

### అల్లూరి సీతారామరాజు జయంతి


అల్లూరి సీతారామరాజు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పాణ్యం: స్థానిక ప్రభుత్వ డీగ్రీ కళాశాలో మంగళవారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 125వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అల్లూరి చేసిన త్యాగాలను ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి భాస్కర్ గుర్తు చేశారు.

### రేషన్ బియ్యం స్వాధీనం

ఓర్వకల్లు: మండలంలోని సోమయాజులపల్లె వద్ద మంగళవారం 430 బస్తాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు.. పాలాది చింతన్న నంద్యాల జిల్లా నుంచి బియ్యం వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం. నందికొట్కూర్ నియోజకవర్గం పగిద్యాల మండలం ప్రాతకోట గ్రామానికి చెందిన పక్కీరయ్య కుమారుడు రవి.. నంద్యాల ప్రాంతంలోని వివిధ గ్రామాల నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని లారీలో తరలిస్తున్నట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం అందింది. ఓర్వకల్లు ఎస్ఐ మల్లికార్జున తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని లారీని పట్టుకున్నారు. బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించినట్లు ఆర్ఐ రంగస్వామి తెలిపారు. ఆర్ఐ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

---



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు హరి కృష్ణారెడ్డి. స్వగ్రామం చిన్నటేకూరు. 2015 సంవత్సరంలో నిర్వహించిన ప్రజా సాధికార సర్వేలో కుటుంబం మొత్తం ఒకే ఫ్యామిలీగా నమోదు చేశారు. మూడు కుటుంబాలకు చెందిన 14 మందిని ఒకే కుటుంబంగా హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చేశారు. ప్రస్తుతం మా మూడు కుటుంబాలకు వేరు వేరు బియ్యం కార్డులు ఉన్నాయి. హౌస్ హోల్డ్ మ్యాపింగ్ ద్వారా స్ప్లిట్‌టింగ్ చేయకపోవడంతో ఆ కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు రావడంలేదు. ప్రస్తుతం జగనన్న సురక్ష కార్యక్రమంలో హౌస్‌హోల్డ్ స్ప్లిట్‌టింగ్ చేశారు. ఇప్పటి నుంచి మాకు ప్రభుత్వ పథకాలు అందుతాయని సంతోషం వ్యక్తం చేశాడు హరికృష్ణారెడ్డి.

## మిగిలిన అర్హులను గుర్తించేందుకే
# జగనన్న సురక్ష

- సాంకేతిక సమస్యలతో అందని పేదలకు ప్రభుత్వ ఫలాలు అందజేస్తాం
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


ఎమ్మెల్యే కాటసాని చేతుల మీదుగా కౌలు కార్డును అందుకుంటున్న కౌలురైతు

ఓర్వకల్లు: సాంకేతిక సమస్యల మూలంగా మిగిలిపోయిన అర్హులను గుర్తించేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. అర్హులు ఏ ఒక్కరూ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని, ప్రభుత్వ ఫలాలు అందని పేదలు సమస్యను వివరించి లబ్ధి పొందాలని సూచించారు. మంగళవారం మండలంలోని కాల్వ గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసానితో పాటు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ అధికారులు, వలంటరీలు, సచివాలయ సిబ్బంది కలిసి ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి వినతులను స్వీకరిస్తారన్నారు. ఆ తర్వాత వచ్చిన వినతులను పరిశీలించి అర్జిదారులకు అవసరమైన ధ్రువ పత్రాలను ఉచితంగా అందజేస్తారని తెలిపారు. అర్హతే మేరకు సంక్షేమ పథకాలు అందజేస్తారని హామీ ఇచ్చారు. అదేవిధంగా అర్హులైన ప్రతి నిరుపేదలకు ఈ నెలాఖరులోగ ఇళ్ల పట్టాల పంపిణీ చేపడుతామని భరోసానిచ్చారు. భూముల రీసర్వే ద్వారా గతంలో ఆక్రమణకు గురైన ఆలయ, అసైన్డ్ భూములను బయటకు తీస్తామన్నారు. అనంతరం వివధ రకాల ధ్రువ పత్రాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఎంపీపీ తిప్పన్న, జడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, మండల సచివాలయ కన్వీనర్ లోటర్ బాష, సర్పంచు కెపీ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు నాగిరెడ్డి, స్థానిక నాయకులు చిన్న వెంకటేశ్వర్లు, ఉప సర్పంచు నూర్ అహ్మద్, ఎర్రెద్దుల సుల్తాన్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం సచివాలయం–2 పరిధిలో మంగళవారం "జగనన్న సురక్ష" కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ఎంపీపీ ఉసేన్‌బీ, సర్పంచ్ మేకల పల్లవి, కో–ఆప్షన్ సభ్యులు జాకీర్‌ఉసేన్, తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, ఎంపీడీఓ దస్తగిరి, ఎంఈఓ–2 సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. వివిధ ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు వారు అందజేశారు. 550 మందికి టోకెన్లు జారీ చేసి వారికి సర్టిఫికెట్లు అందించామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ భాస్కర్‌రావు, ఏపీఎం ప్రసాద్, బాబు, ఈఓ అనురాధ, సచివాలయ సిబ్బంది ప్రవీణ్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు సర్టిఫికేట్లను అందిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ, తహసీల్దార్, సర్పంచ్

కల్లూరు: మండల పరిధిలోని ఉలిందకొండ, ఎ.గోకులపాడు గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవాం అధికారులు జగనన్న సురక్ష పథకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, డిప్యూటీ తహసీల్దార్ గిరికుమార్‌రెడ్డి, ఈఓఆర్డీ రవికిషోర్ వివిధ ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఉలిందకొండ సర్పంచ్ మాసెపోగు సుంకులమ్మ, ఎ.గోకులపాడు సర్పంచ్ గిడ్డమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు రమణారెడ్డి, రమణ, శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు నాగేశ్వరరావు, భార్గవి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

### చాలా సంతోషంగా ఉంది



గతంలో ఇన్‌కం, క్యాస్ట్ సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టు తిరిగినా సకాలంలో అందేవికావు. సర్టిఫికెట్‌కు దాదాపుగా వారం పట్టేది. ప్రస్తుతం సర్టిఫికట్లు తీసుకోవాలంటే కేవలం ఒకే రోజు సమయం పడుతుంది. అది కూడా వలంటరీలు ఇంటి వద్దకు తెచ్చి ఇస్తున్నారు. కేవలం రోజు వ్యవధిలోనే ప్రభుత్వం సేవలు అందుతున్నాయి. నేను సచివాలయ సిబ్బంది, వలంటీర్ చేపట్టిన సర్వేలో టోకెన్ రాయించా. ఉచితంగా ఇన్‌కం సర్టిఫికెట్ జారీ చేశారు. చాలా సంతోషంగా ఉంది. – కవిత, పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల చైర్మన్

## సమస్య పరిష్కార వేదిక


సి.బెళగల్ మండలం ఈర్లదిన్నెలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

- పండుగలా జగనన్న సురక్ష సదస్సులు
- అవసరమైన వారికి అప్పటికప్పుడే ధ్రువపత్రాల పంపిణీ
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు

కోడుమూరు రూరల్/సి.బెళగల్: జగనన్న సురక్ష సదస్సులతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. అన్ని శాఖల అధికారులు గ్రామాలకే వచ్చి అవసరమైన ధ్రువపత్రాలను అందజేస్తుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సదస్సులు సమస్యల పరిష్కార వేదికలవుతున్నాయి. మంగళవారం కోడుమూరు మండలంలోని ఎర్రదొడ్డి, అనుగొండ, సి.బెళగల్ మండలంలోని ఈర్లదిన్నె, కొత్తకోట గ్రామాల్లో ఏర్పాటు చేసిన సదస్సుల్లో అధికారులతో పాటు ఎమ్మెల్యే సుధాకర్ పాల్గొని లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు.

**కోడుమూరు మండలంలో..**

మండలంలోని ఎర్రదొడ్డిలో ఎంపీడీఓ చంద్రశేఖర్, అనుగొండలో తహసీల్దార్ జయన్నల ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించి 1,180 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు, కౌలు కార్డులను ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అమడగుంట్ల క్రిష్టారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు మధుసూదన్ రెడ్డి, మాధమ్మ, బాలక్రిష్ణ, ఎంపీటీసీలు తిరుపతయ్య, సువర్ణమ్మ, సర్వేశ్వరరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ మధుమోహన్‌రెడ్డి, ఎంఈఓ శరభయ్య, డీటీ రామాంజనేయులు పాల్గొన్నారు.

**సి.బెళగల్ మండలంలో..**

మండల పరిధిలోని ఈర్లదిన్నె గ్రామంలో ఎంపీడీఓ రాముడు, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి, కొత్తకోటలో తహసీల్దార్ శేషఫణి, ఈఓఆర్డీ సందీప్ ఆయా గ్రామాల సర్పంచ్‌లు పెద్దక్క, శ్రీనివాసులు అధ్యక్షతన స్థానిక గ్రామ సచివాలయాల ఆవరణంలో జగనన్న సురక్ష కార్యక్రమ ప్రారంభ కార్యక్రమంను నిర్వహించారు. ఎంపీపీ బొంతల మునెప్పతో కలిసి ఎమ్మెల్యే సుధాకర్ కొత్తకోట గ్రామంలో 188 మందికి, ఈర్లదిన్నెలో 218 మందికి వివిధ ధ్రువపత్రాలు అందజేశారు. అలాగే కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో జగనన్న అమ్మ ఒడి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రభుత్వ విద్యా పథకాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎస్ఓ ఆదినారాయణ, ఎంఈఓ – 2 ఆదాముబాషా, ఎంపీటీసీ సభ్యులు మణిమోహన్‌రెడ్డి, నడిపిసోమన్న తదితరులు పాల్గొన్నారు.

**అర్హులకు వంద శాతం పథకాలు అందజేస్తాం**

కర్నూలు(న్యూటౌన్) : అర్హులకు వంద శాతం పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. మంగళవారం సాయంత్రం 38వ వార్డు మునగాలపాడులో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే అవినీతి, సిఫారసులకు తావు లేకుండా సంక్షేమ పథకాల ఫలాలను నేరుగా ప్రజల ఖాతాల్లోనే నగదు జమ అవుతుందన్నారు. అర్హత ఉండి సాంకేతికత, ఇతర కారణాల మూలంగా సంక్షేమ పథకాలు అందని వారికి జగనన్న సురక్షతో లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు సుంకన్న, ఎర్ర పక్కీరన్న, మహేష్ గౌడ్, ఖాజాబీ, శేషన్న, మునగాలపాడు ప్రజలు , నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

### కార్యాలయాల చుట్టూ తిరగాల్సివచ్చేది



గతంలో ఏ సర్టిఫికెట్ పొందాలన్నా ఊరికి 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోడుమూరుకు పనులు మానుకుని వెళ్లాల్సి వచ్చేది. రోజుల తరబడి ఆయా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగేవాళ్లం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఏ పథకమైనా మా ఇంటి వద్దకే వలంటరీల ద్వారా చేరుతుండడం సంతోషంగా ఉంది. ఇప్పుడు కూడా నా మ నవళ్ల కోసం కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేస్తే రెండు రోజుల్లోనే పైసా ఖర్చు లేకుండా ఇచ్చారు. ఇలా సేవలందిస్తున్న ముఖ్యమంత్రిని ఏనాడూ చూడలేదు. – ఇద్రూస్ సాహెబ్, అనుగొండ

### ఇబ్బందులు పడేవాళ్లం



మా ఊరు ఎర్రదొడ్డి మండల కేంద్రానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉంది. పెద్దగా రవాణా సౌకర్యాలు లేవు. ఏవైనా సర్టిఫికెట్లు కావాల్సి వస్తే నాలుగు నుంచి ఐదు రోజుల పాటు ఆయా ప్రభుత్వ ఆఫీసుల చుట్టు తిరుగుతూ ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లం. నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగజేయకుండా అవసరమైన సర్టిఫికెట్లను అర్జీలు పెట్టిన రెండు రోజుల్లోనే ఇంటి వద్దకే వలంటరీల ద్వారా ఉచితంగా అందజేస్తుండడం ఎంతో సంతోషంగా ఉంది. – శ్రీనివాసులు, ఎర్రదొడ్డి

## పేదల సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్


ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్: పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్.జగనమోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం పెద్ద బోయ, కురువ, చాకలి వీధుల్లో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల వల్ల పొందిన లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్‌ను అందించారు. టీడీపీ హయాంలో నిర్మించుకున్న ఇళ్లకు బిల్లులు మంజూరు చేయాలని కొందరు, సీసీ రోడ్లు, మురుగు కాల్వలు నిర్మించాలని మరికొందరు ఎమ్మెల్యేకు విన్నవించగా స్పందించిన ఆయన.. పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎస్ఐ శ్రీనివాసులు, ఏఓ రవిప్రకాష్, ఏఈఓ ప్రసాద్, గంగరాజు, ఏపీఎం పుష్పావతి, ఈఓ అజయ్‌భాస్కర్, సర్పంచు బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ఎస్టీపీ యూనిట్ ఏర్పాటుకు స్థల పరిశీలన

గూడూరు: నగర పంచాయతీలో ఏర్పాటు చేయనున్న ఎస్టీపీ(స్టీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) మురుగు నీటిని శుద్ధి చేసే యూనిట్ ఏర్పాటుకు ఎంపిక చేసిన స్థలాన్ని మంగళవారం తహసీల్దార్ శివశంకర్ నాయక్, నగర పంచాయతీ అధికారులు పరిశీలించారు.

### బంజరు భూములకు పట్టాలివ్వాలి

గూడూరు: మండలంలో పేదలు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ బంజరు భూములకు పట్టాలివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మోహన్, దానమన్న, సోమలింగడు తదితరులు మంగళవారం రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందించారు.

### నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కల్లూరు: మండల పరిధిలోని రెమడూరు గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ జీవీ రమణమూర్తి తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. మండలస్థాయి వివిధ శాఖల అధికారులు నివేదికలతో హాజరు కావలన్నారు.

### ముగ్గురికి స్వల్పగాయాలు

కోడుమూరు రూరల్: మండల పరిధిలోని ప్యాలకుర్తి సమీపంలో ఐరన్‌ఓర్‌తో బేతంచెర్లకు వెళ్తున్న లారీని పత్తికొండ మండలం కనకదిన్నె నుంచి కర్నూలుకు వెళ్తున్న కారు వేగంగా ఢీకొట్టిన ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. కనకదిన్నెకు చెందిన శ్రీనివాసులు సోమవారం మరో ఇద్దరు బంధువులతో కలిసి కారులో కర్నూలుకు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. కోడుమూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

### ఎల్లమ్మ తల్లీ... దీవించమ్మా!



కర్నూలు (న్యూటౌన్): మండల పరిధిలోని వెంకాయపల్లెలో వెలసిన ఎల్లమ్మతల్లి ఆలయం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. ఉదయం 5 గంటలకు ఆలయ పూజారులు అమ్మవారికి అభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కు తీర్చుకున్నారు. నూతన వధూవరులు, ఉద్యోగ ప్రాప్తి, సంతానప్రాప్తి ప్రసాదించాలని కోరుతూ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అమ్మా ఎల్లమ్మా చల్లంగా దీవించు మాయమ్మా.. అంటూ భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో గుడి చుట్టూ ప్రదక్షణలు చేశారు.


భక్తులతో కి క్కిరిసిన ఎల్లమ్మతల్లి దేవస్థానం, ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మతల్లి

### ఇద్దరిపై కేసు నమోదు

గడివేముల: మండల పరిధిలోని పెసర వాయి గ్రామానికి చెందిన దోని మోహన్ కృషుడు పొలంలోకి అక్రమంగా ప్రవేశించినట్లు అందిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట సుబ్బయ్య మంగళవారం తెలిపారు. కృష్ణుడికి గ్రామ పొలిమేరలో సర్వేనంబర్ 105, 106 లలో 2.41ఎకరాలు ఉంది. ఈయన పొలం పక్కన పెదనాన్న కూతురు సువర్ణకు 2.70 ఉంది. అయితే సువర్ణ పొలాన్ని అదే గ్రామానికి చెందిన ప్రణీత్ కుమార్ రెడ్డికి సరిహద్దులు చూపకుండా విక్రయించింది. సువర్ణ, మధు దౌర్జన్యంగా పొలంలోనికి అక్రమంగా ప్రవేశించి సరిహద్దు రాళ్లను తొలగించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

## పందుల స్వైరవిహారం!


ఇళ్ల మధ్యలోని ఖాళీ స్థలాలో పందుల గుంపు

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని పందుల సంఖ్య నానాటికి పెరుగుతుంది. ఎక్కడపడితే అక్కడ స్వైరవిహారం చేస్తున్నాయి. ఎక్కడ ఖాళీ స్థలం అక్కడే పందులు మాకం మార్చి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. గుంపులు గుంపులుగా రోడ్లపై తిరుగుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురువుతున్నారు. వర్షాకాలం ప్రారంభమైనందును అంటు వ్యాధులు ప్రభలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటిని ఇతర ప్రదేశాలకు మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

### క్రైం కార్నర్

**పాత నేరస్తుల అరెస్టు**

కర్నూలు: నాటుసారా విక్రయించి సొమ్ము చేసుకుంటున్న 14 మంది పాత నేరస్తులను ఒకటవ పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కర్నూలు పాతబస్తీలోని వివిధ కాలనీల్లో నివాసముంటున్న షేక్ నిసార్ అహ్మద్, అయూబ్ బాషా, ఎండీ రియాజ్, పఠాన్ షాకీర్ ఖాన్, జగ్గుల రాజేష్ తదితరులను పాతబస్తీ శివారులోని జమ్మిచెట్టు బ్రిడ్జి వద్ద నాటుసారా విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం అందడంతో నిఘా వేసి ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి పది సీసాల నాటుసారా సీజ్ చేసినట్లు ఒకటవ పట్టణ సీఐ నాగశేఖర్ తెలిపారు. అలాగే జొహరాపురానికి చెందిన చాట్ల విశ్వనాథ్, గుంపు శ్రీనివాసులు, జరదొడ్డి ఇజ్రాయెల్, జరదొడ్డి లక్ష్మమ్మ, జి.శ్రీను, మల్లెపోగు నరేష్, చంద్రకంటి లక్ష్మమ్మ, మల్లెపోగు బుజ్జి, గద్దపోగు మద్దమ్మ తదితరులు జొహరాపురం శివారులోని కేసీ కెనాల్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద అదుపులోకి తీసుకుని వారి వద్ద 18 సీసాల నాటుసారాను సీజ్ చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

**మద్యం విక్రేతల అరెస్టు**

కర్నూలు: తెలంగాణ నుంచి తక్కువ ధరకు మద్యం తెచ్చి కర్నూలులో ఎక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్న ఇద్దరిని మూడో పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. బుధవారపేటకు చెందిన జగ్గుల ప్రసాద్, షేక్ అమీన్ బాషా తదితరులు కిసాన్‌ఘాట్ సమీపంలోని హంద్రీ నది ఒడ్డున తెలంగాణ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసి అదుపులోకి తీసుకుని వారి నుంచి 14 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

## గోదాముల నిర్మాణాలు పూర్తి చేయాలి



సమావేశానికి హాజరైన అధికారులు


మాట్లాడుతున్న కలెక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): బహుళ ప్రయోజన గోదాముల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైతుభరోసా కేంద్రాలకు అనుసంధానంగా బహుళ ప్రయోజన గోదాముల నిర్మాణాలకు మొదటి విడతలో 95, రెండో విడతలో 10, మూడో విడతలో 40 మంజూరయ్యాయన్నారు. వీటిలో కేవలం 8 మాత్రమే పూర్తి చేశారని, పెండింగ్‌లోని 87 భవనాలను ఆగస్టు 15వ తేదీలోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఇక నుంచి పనుల పురోగతిని రెండురోజులకొకసారి జాయింట్ కలెక్టర్‌కు నివేదికను అందజేయాలన్నారు. రెండో విడతకు సంబంధించి మంజూరైన భవనాలకు త్వరితగతిన ప్రదేశాలను గుర్తించి భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. మూడో విడత గోదాములకు సంబంధించిన భూములను గుర్తించామని నిర్మాణానికి అనువైనది కాదో తెలపాలని డీసీఓ రామాంజనేయులు కలెక్టర్‌ను కోరగా మార్కెటింగ్ ఇంజినీర్లు వెళ్లి పరిశీలించి వారంలోపు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. రైతులు పండించిన పంట ఉత్పత్తులను తూకం వేసుకునేందుకు 95 ఎలక్ట్రానిక్ కాటాలు మంజూరైనట్లు డీసీఓ తెలిపారు. వాటిని వెంటనే సంబంధిత గోదాములకు పంపాలని కలెక్టర్ సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి, మార్కెటింగ్ ఏడీ నారాయణమూర్తి, జిల్లా హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించండి


శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని


సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: వైద్యాధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రం ఓర్వకల్లులో రూ.5.85 కోట్లతో అత్యాధునికంగా నిర్మించిన 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం భవన సముదాయాన్ని మంగళవారం వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావుతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వైద్య పరికరాలు, యంత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు అత్యంత ప్రాధాన్యతను కల్పించారని తెలిపారు. అందులో భాగంగానే హుసేనాపురంలో రూ.1.85 కోట్లతో 10 పడకల నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఓర్వకల్లులో రూ.5.85 కోట్ల నాబార్డు నిధులతో నూతనంగా 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించడం అభివృద్ధికి నిదర్శనమన్నారు. ఇకమీదట ఆసుపత్రిలో స్త్రీవ్యాధి నిపుణులు, చిన్నపిల్లల వైద్య నిపుణులు, గైనకాలజిస్టు, జనరల్ ఫిజిషియన్, శస్త్ర చికిత్స నిపుణులు ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఆసుపత్రిలో అందజేసే సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, వైద్యాధికారి డాక్టర్ మంజుల, ఎంపీటీసీ సభ్యులు షాకిరున్నిషా, సర్పంచ్ తోట అనూష, ఆసుపత్రి సలహా మండలి సభ్యులు రాజమోహన్‌రెడ్డి, పీఎంసీ చైర్మన్ మద్దిలేటి, స్థానిక నాయకులు నాగలిగేశ్వరరెడ్డి, శంకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పెద్దయ్య పాల్గొన్నారు.

**సంక్షేమ సారథి సీఎం జగనన్న**

కల్లూరు: సంక్షేమ సారథి సీఎం జగనన్న అని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ 28వ వార్డులోని పందిపాడు, అశ్వత్థాపురం గ్రామాల్లో కార్పొరేటర్ నారాయణరెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్యాయంగా పలకరిస్తూ సమస్యలను తెలుసుకున్నారు. నాలుగేళ్లలో ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరించి, సంక్షేమ క్యాలెండర్ అందజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన 98 శాతం హామీలు అమలు చేశామన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, జయరాముడు, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, కల్లూరు అర్బన్ వార్డుల జేసీఎస్ కన్వీనర్లు గోవర్ధన్ రెడ్డి, హనుమంతురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాసులు యాదవ్, సత్యంరెడ్డి, సుబ్రహ్మణ్యం స్వామి, మాజీ సర్పంచ్ అయ్యప్ప, పర్ల సుంకన్న, తిరుపాల్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.